

# దారి తప్పిన దేవుడు

కె. వివేకానందమూర్తి

వాన్ వానలో తడుస్తోంది. వానపాములా నడుస్తోంది. సెలైన్ డ్రిప్ జ్ఞాపకాని కొస్తోంది.

ఎదురుగా అద్దం ఏడుస్తోంది. వైపర్లు కన్నీటి చినుకుల్ని తుడుస్తూ ఓదారుస్తున్నాయ్.

చీకటి గుయ్యారంగా వుంది. చీల్చే ప్రయత్నం వొయ్యారంగా వుంది.

అందంగా తూలుతోంది అటూ ఇటూ – తాగిన అప్సరసలా. టాంకులో పెట్రోల్లో స్కాచి కల్తీ అయిందేమో అనుకొన్నాను. కాలే సిగరెట్టు వెలుగుతో వాచీ చూసుకున్నాను. కాలానికి మొహం వాచినట్టుంది. సెకన్లముల్లు అర్జంటు పనున్నట్టు గబగబా తిరుగుతోంది.

చీకటి ఎంత బలిసిందో హెడ్‌లైట్స్ వెలుగు చెబుతోంది. చినుకులు కిరణాల్ని కడిగి మెరుగు పెడుతున్నాయి. స్టీరింగ్ మీది అరచేతుల్లో వేడి వొంటికి చాలకుండా వుంది. ఏదో చలి రహస్యం చెబుతున్నట్టు చలిగాలి చెవుల పక్కనుంచి రివ్వున వీస్తోంది. బురదలో చక్రాల రొద – భూతాల్లా దారిపక్క చెట్లు – గతుకుల మీంచి గమ్యానికి ప్రయాణం – నిద్రపోతున్న రాక్షసి పలవరింతలా రాత్రి – నాకు చిరాకనిపించేయి. డాక్టర్నయినా నేనూ మనిషిని. కానీ తప్పని సరి మరి. ఒంటరిగా వొక్కణ్నీ – వానలో వాన్‌లో ఈ ప్రయాణం నా కోరికల కలమీద పగ తీర్చుకొంటోంది. పక్కన పడుచుపిల్ల వుంటే ఈ అనుభవం ఎంత తేడాగా, తియ్యగా వుండేదో అని అంచనా వేసుకున్నాను.

చీకటి ముదిరేక పక్క వూర్నించి కబురొచ్చింది – ప్రాణాలమీది కొచ్చిందిట. వచ్చేదాకా ప్రాణాలు తీసేడు. డ్రైవరుకి ఫీవరు. ఒంటిగానే బయల్దేరేను. అక్కడ రాత్రి అర్ధరాత్రయింది. మబ్బులు కమ్మడం చూసి దబ్బున బయల్దేరాను. కానీ యిబ్బంది రాసిపెట్టినట్టుంది – వర్షం దారికాసింది.

చీకటి చిక్కగావుందని వుబలాటపడి ఆకాశం కళ్లుతెరిచింది. ఆ మెరుపులో చీకటి సిగ్గుపడింది. మళ్ళా ఆకాశం నిద్రోయింది – ఆకలి కవిత్వంలా నాలో చీకటికవిత్వం పుట్టుకొస్తోంది. ధారలశబ్దం, వందలాదిజనం సీటి కొరడాలతో కొడుతున్నట్టుంది.

ప్రైమరీ హెల్త్ సెంటర్లో డాక్టరుగా అడుగు పెట్టేముందు, స్నేహితులు చెప్పేరు నాకు – కరణం, మునసబుల మధ్య శాండ్‌విచ్ అయిపోతే తోచనప్పుడల్లా సమితి ప్రెసిడెంటు టెస్ట్ చేస్తూంటాడని. కానీ యీ పల్లెటూళ్ళో అడుగు పెట్టేక నేను విని నమ్మిన వూహని కాదనే వింతనిజాన్ని చూసేను. నాకీ ప్రపంచం పచ్చని సంసారంలా అనిపించింది. ఈ ఊరికీ, ఈచుట్టుపక్కల మరికొన్ని పల్లెలకీ కలిపి నాయకుడినై రోజూ రోగులతో కత్తియుద్ధం చేస్తూ వీళ్ళకి ఆరోగ్యరక్షకుడి నయ్యేను. వూరంతాకలిపి సుమారు వెయ్యి గడప వుంటుంది. వూరిమధ్య వేణుగోపాలస్వామి ఆలయం వూరంతటికీ వుజ్వలంగా కనబడుతుంది. ఆయన ఆ వెయ్యిళ్ళకీ వెలలేని దేవుడు. యిక్కడికి వచ్చేక నేను వెయ్యిళ్ళ పూజారి నయ్యేను. ఈ మనుషుల మాంసంలోనూ, మనసులలోనూ ఆరోగ్యాన్ని చూసేను. ఐకమత్యం చూసేను, పరమార్థికచింతన చూసేను. వీరి చూపుల్లో భక్తినీ, అనురక్తినీకూడా చూసేను. వీళ్ళంతా నన్ను ఒక అశ్వినీదేవతలా చూస్తున్నారు. వీళ్ళు నాకు నచ్చేరు.

వాన బాగా పెరిగింది.

వాన్ మొరాయిస్తోంది.

ఉన్నట్టుండి కుడివేపు ముందుచక్రం



గుంటలో దిగపడింది. ముందుకి కదలనివ్వడంలేదు. తిక్క పేషంటులా తిప్పలు పెడుతోంది. చివరి దమ్ములాగి సిగరెట్టు పారేసి డ్రైవ్ చేసేను. గేరుమార్చినా దాని వుద్దేశం మార్చుకోలేదు. నాకు తప్పలేదు. ఇంజను ఆపివేశాను. దిగే ప్రయత్నంలో తలుపుతీసేను. చలీ, వర్షం చెంపమీద సాచికొట్టేయి. దిగి దిగడంతోనే కాలవలో మునిగినట్టు తలనుంచి కాళ్ళదాకా తడిసిపోయేను. వాన్ మీద చేతులుమోపి ముందుకి తోసేప్రయత్నం చేసేను. కదల్లేదు. చేతులుజారాయి అలసిపోయాను. బోర్నవిటా తాగుతున్నా బలంచాల్లేదు నాకు. నా పరిస్థితికి నామీద నాకే జాలేసింది. వర్షాన్ని భరించలేక లోపలికి ఎక్కికూర్చున్నాను. మళ్ళా స్టార్ట్ చేసేను. కదల్లేదు. చిరాగ్గా మరోసిగరెట్టు వెలిగించుకో బోతూంటే హఠాత్తుగా వెనకనుంచి ఎవరో తోసినట్టయింది. వాన్ ముందుకి కదిలింది. తలవని తలంపుగా జరిగిన వుపకారానికి చకితుణ్ణయి తలతిప్పేను. అనుకోకుండా అవతలివేపు ఫ్రెంట్ డోరు తెరుచుకుంది. తటాలున లోపలికిఎక్కి కూర్చుని డోర్ మూసింది. 'హమ్మయ్య' అనుకొంది పైకి - 'ఆమె' ఎవరు? కారుచీకటిలో కారుతోసిన ఈ కాంతఎవరు? 'వోకౌన్ థీ' సినిమా ఓక్షణం గుర్తుకొచ్చి మనోజ్‌లా కళ్లు చిట్లించేను. కానీ నేను భయపడలేను. నాకు దయ్యాలంటే నమ్మకంలేదు. 'ఉఁ కదలండి!' అంది కాజువల్‌గా. నేను ఆమెవేపు అలాగే అల్లాడని ఆకులా చూస్తున్నాను. చదువులేని కుటుంబంలోపుట్టి, చదుకోడం మానేసి, సంస్కారాన్ని చదువుకున్నట్టుంది ఆమెకళ. తడిసిన జుట్టునీ, ముఖాన్నీ చేతులు వైపర్సులా చెరుపుతున్నాయి. ఆమె ముఖం అద్దంలావుంది. ఆమె చాలా ఏపుగా, బలంగా రష్యన్ స్పోర్ట్సు వుమన్‌లావుంది. చీరెలో, జాకెట్టులో, చెదిరిన ముంగురుల్లో, చెవిరింగుల్లో, చెక్కిన అజంతాశిల్పంలా కూడా వుంది. అందంలోంచి సౌకుమార్యాన్ని వేరుచేసి సౌష్ఠవాన్ని పొదిగినట్టుంది. ఈ చిత్రమైన కాంబినేషన్ నేనెక్కడా చూళ్ళేదు. ఆ చొరవ, ఆ కూర్చొన్న తీరు, ఆ ఠీవి - యింతకాలం యింతుల్లో అంత బాగుండవనుకునేవాణ్ణి. కానీ యిదో కొత్త అంశం. ఆమె నాకష్టాన్ని గుర్తించిన దేవతలా వచ్చినా, మగాణ్ని కాబట్టి వాతావరణాన్ని బట్టి నాలో కోరిక చెలరేగింది. ఆమె అలా వర్షంలో తడిసినందుకు నేనెంతో హర్షంలో తడిసేను. సామాజిక విలువలు సమయాన్ని బట్టి మరిచేను. అరిచేతుల్లో వేడి ఒళ్ళంతా పాకింది, కోరిక యింత వేడిగా వుంటుందని నాకిప్పుడే తెలిసింది. కానీ అంతలోనే వెనుకనుంచి వాన్ తోసిన వీరవనిత ఈమే అని తెలియగానే నా కోరికని వురితీసేను. యింతలో ఆమె చీరకొంగుతో కళ్లు తుడుచుకోడం పూర్తిచేస్తూ తలతిప్పి నన్ను చూసింది. ఏదో మాట్లాడబోతూంటే నేనే అన్నాను - 'థాంక్స్ - ఎక్కడిదాకా.'

ఆమె చెప్పింది. నేవెళ్ళేవూరే. ఆసక్తిగా అడిగేను - 'నీపేరూ?' 'అలివేలు' - ఆమెకి ఆ పేరెందుకో నప్పలేదనిపించింది నాకు. అడక్కముందు ఆమె పేరు సుబ్బలక్ష్మో, కౌసల్యో అయితే బాగుణ్ణనుకున్నాను, అవి నాకెందుకో ఆ మనిషికి తగ్గట్టు హెవీగావుండి సరిపోతాయనుకున్నాను. కానీ అలివేలు మెత్తగా వుంది. ఆ పేరులో ఏదో భావబంధం వుందనిపించింది. అలా అనిపించగానే అంతవరకూ కఠినశిలని చెక్కి ఒద్దినట్టున్న ఆమె యిప్పుడు కమనీయమైన పాలరాతి బొమ్మలా కనిపించింది.



వాన్ స్టార్ట్ చేసేను. ముందుకి చూస్తూనే
గం సగం పక్కకి చూస్తున్నాను. ఆమె
దాల బిగింపులో ఏవో పట్టుదల పచార్లు
స్తున్నట్టుంది. కళ్ళల్లో తొందరపాటు
సి కుతూహలంగా అడిగేను –

'యింతరాత్రి మావూళ్ళో నీకేంపని ?'

'వేణుగోపాలస్వామిని తీసుకు వెళ్ళాలి.'

'భర్తా ?'

'నాకింకా పెళ్ళికాలేదు' – మనసులో
హమ్మయ్య' అనుకున్నాను. ఎందుకో
కే తెలియదు. మనకి దక్కకపోయినా
ళ్ళికాని అందమైన అమ్మాయి, పెళ్ళయిన
మ్మాయికంటే ఎందుకో దగ్గరగా అని
స్తుంది. మళ్ళా నేనే ముందు మాట్లాడేను –
అన్నగారా ?'

'ఎవరూ కాదు – నా కెవరూలేరు–నాన్న తప్ప.'

'మరి ?'

'దేవుడు.'

'అంటే ?'

'భగవంతుడు'

'నా కర్థం కావటంలేదు.'

'అవును. భగవంతుడంటే –' ఆమె అద్దంవేపు చూస్తూ కన్యాశుల్కంలో మధుర వాణిలా నవ్వింది. కాంతిలాగా మెరిసి ఆ నవ్వు నా మీదకి పరావర్తనం చెంది నాలో ఏదో పరివర్తన కలిగించింది. ఆ నవ్వుతో దెబ్బతిన్నట్టు ఫీలయి నన్ను నేను పెంచుకోవాలనుకుని అలివేలుమీద వాత్సల్య భావాన్ని పెంచుకున్నాను. క్లచ్ నొక్కుతూ అడిగేను.

'వివరంగా చెప్పు.'

'చెప్పానుగా – నేను దేవుణ్ణి తీసుకువెళ్ళడానికి వస్తున్నాను.'

'తీసుకు వెళ్తే వస్తాడా దేవుడు ?'

'నేను తీసుకు వెళ్ళగలను.'

యింతవరకూ అలివేలు ఫ్రీలో చిత్రమయిన కలబోకల్ని చూసేను. యిప్పుడు వ్యక్తిత్వం మరింత చిత్రంగా కనిపిస్తోంది. మానవ లక్షణాల పొందిక ఆమెలో విలక్షణంగా వుంది – అర్ధరాత్రి వానలో దేవుణ్ణి తీసుకువెళ్తానంటూ వస్తోంది ! దేవుణ్ణి తీసుకువెళ్ళడం ఏమిటి ? అందరిలో అన్నిచోట్లా వ్యాపించిన భగవంతుణ్ణి పట్టుకోడం

సాధ్యమా! అయినా వేణుగోపాలస్వామి లోనే అలివేలు తన దేవుణ్ణెందుకు చూసింది? – ఒకవేళ పారవశ్యంలో అలా అంటోందేమో! అయితే అర్ధరాత్రివర్షంలో దైవదర్శనమా? – అలివేలుకి పిచ్చేమో అని అనుమానం వేసింది నాకు. అయినా యిన్ని విలక్షణాలు మూర్తీభవించిన స్త్రీలో ఈ వుద్దేశం వుదయించడంలో వింత ఏ మాత్రం లేదు.

వాన తెరిపిస్తోంది. వాన్ దీపాల వెలుగులో వూరు కవిపిస్తోంది. యిక దిగిపోతుందిలావుంది నా అజంతా కన్య. మళ్ళా మనిషిని పూర్తిగా చూసేను – ముఖ్యంగా తడిసి కనిపించాలనుకునే భాగాలు. ఏదో అందమైన మగతనం అలివేలు కూర్చున్న తీరులో అగుపడింది. అడిగేను.

'నీలో మగతనం ఎందుక్కనిపిస్తోంది?' అనికాదు. 'వాన్ కనబడకపోతే ఏం చేసే దానివి?'

'నేను ముందుకి తొయ్యకపోతే మీరేం చేసేవారు?'

నవ్వుకున్నాం.

'ఆపండి.'

'నవ్వా?'

'ఉహూ వాన్.'

'ఏం?'

'దిగిపోతాను.'

'తడిసిపోతావు' స్లో చేసేను.

'తడిసేకే ఎక్కాను. అయినా యీ చినుకులు ఫర్వాలేదులెండి.'

'మా యింటికి వస్తే వొళ్ళారబెట్టుకుని వేడి టీ తాగి వెళ్ళొచ్చు.' ఆపుతూ అన్నాను.

'రాను.'

'నాకు పెళ్ళికాలేదు, ఒక్కణ్ణే. యింటి దగ్గర యిబ్బంది వుండదు నువొస్తే.'

'నాకు వుంటుంది. త్వరగా చేసుకోండి. వస్తా.' తలుపు సగం తెరిచింది.

'నీకు ఫ్లూ వస్తే బాగుణ్ను.'

'మీరు డాక్టరా?'

తల పంకించేను.

'నాకు జ్వరాలు రావు. నేనే వీలైనప్పుడు వస్తాను. నమస్తే!' దిగబోతోంది.

'చూడు – నీ సహాయానికి చాలా కృతజ్ఞుణ్ణి కానీ – యింతకీ నీ రాక నా కింకా బోధపడలేదు.'

'తెల్లారేక తెలుస్తుంది లెండి' – ఏమిటి? తెలివా? – ఆమె పెదాలు విరిగేయి. ఆ నవ్వు నాకు నచ్చింది. ఆ అనుభూతి అనుభవిస్తూంటే ఆమె చీకట్లో కలిసిపోయింది. అరకులోయ, కులూవ్యాలీ లోతుల్లోకి జారిపోతున్నట్టుగా డ్రైవ్ చేస్తూ మెల్లగా గూటికి చేరేను. నా ఆలోచనల్లో అలివేలు నిద్రపోయింది. అలివేలు ఆలోచనల్తో నాకు నిద్ర పోయింది.

* * *

హఠాత్తుగా మెలుకువొచ్చింది. ఎవరో దబదబా గబగబా తలుపు తడుతున్నారు. నిద్రెప్పుడు పట్టిందో తెలియలేదు. గానీ పాడయినందుకు తీవ్రంగా కోపం వచ్చింది. కానీ, వృత్తి, సహనాన్ని గుర్తు చేస్తే, లేచి లైటువేస్తూ 'ఆఁ' అన్నాను. నా అలికిడికి తలుపు చప్పుడు ఆగింది. యిది మరో అర్జంటు కేసై వుంటుంది. ఎందుకో ఈరోజు రోజూలాలేదు. తలుపుతీస్తూ అనుకున్నాను – ఒకవేళ అలివేలు కాదు కదా! అయినా యిప్పుడు ఎందుకు వస్తుంది? తీసి చూస్తే నే చూసినదృశ్యం నన్ను విగ్రహాన్ని చేసింది. నేచూసింది నే నూహించిన అలివేలుకాదు. వొంటినిండా దెబ్బల్తో, రక్తంతో, గుండెచెదిరేలా కనిపించే అలివేలు. ఆమెచీర బాగా నలిగి జారిపోయింది. కవచంలాంటి జాకెట్టు కానిచోట చిరిగింది. కళ్ళల్లో కనిపించిన ఠీవి చెదిగింది. గాజులు పగిల్తే – చేతుల్లోంచి రక్తంలావుంది. గాలి వీస్తూంటే రింగులూ, ముంగురులూ చిరాకు పడుతున్నాయిలా వుంది. దీపం వెలుగులో దీనంగా, దిగులుగా, భయంతో, బెంగతో నా వేపు చూస్తూ నిలబడింది. అలా వూహించని వుపద్రవం చూచి రెపరెపలాడేను నేను. పొడి పెదవుల్తో రమ్మన్నాను. ఆమె శరణుకోరిన లేడిలా తొందరగా లోపలికి ప్రవేశించింది. గోడవార కుర్చీలో కూలబడి చేతుల్తో యిమడని రొమ్ముల్ని పొదివి పట్టుకుంటూ మాట్లాడింది – 'ముందా తలుపుగడియ వేసేయండి.'

ఇప్పుడామెలో భయం బాగులేదు. ఆమె చెప్పినట్టే చేసేను. ఆమె కూర్చోలేకపోవడం చూసేను. కంగారుగా తీసుకువెళ్ళి ఆమెని బెడ్ మీద పడుకోబెట్టేను. ఆ కళ్ళల్లో ఆవేదన నన్ను కదిలించింది.

'నన్ను రక్షించండి?' జాలిగా అర్థిస్తూ అడిగింది. అలివేలు నా స్థితిలో చూడగానే 'ఆల్బర్ట్ మొరేవియో టూ వుమెన్'లో ఎక్కడో పేజీలు నామనసులో చిరిగేయి. యీ అత్యాచారానికి కారకులైన రాక్షసులెవరా అనిపించింది, నాకు అంతుపట్ట లేదు. యిక్కడి మనుష్యులందరికి పువ్వు లాంటి మనసులున్నాయి. వీళ్ళల్లో కనీసం ఒక్కడేనా పాపాత్ము డుంటాడని నే నూహించలేక పోతున్నాను.

బెడ్ మీద అలివేలు బాధగా మూలిగింది. త్వరగా చికిత్సచేసే ప్రయత్నంలో ప్రవేశించబోయేను. యింతలో యింటిబైట జనం కోలాహలం వినబడుతూంది. కిటికీ తెరిచి చూసేను. ఆశ్చర్యం! – నేను దేవత లనుకునే మనుషులు దయ్యాల్లా భయంక రంగా హాహాకారాలు చేస్తున్నారు. చేతుల్లో కర్రలూ, కళ్ళల్లో క్రౌర్యం కనబడుతున్నాయి. యింటిదగ్గరగా వచ్చేసేరు. కల్లో కూడా వూహించని కల్లోలం చూడాలని కంగారు పడ్డాను. 'యిప్పుడు శరణుకోరిన అలివేలుని నే నెలా రక్షించగలను?' అని భయపడ్డాను. జనం యింటికి బాగా దగ్గరకు వచ్చేసేరు. యింటిముందు చెట్లక్రిందికివచ్చే ఆగేరు. అరిచేరు– 'బాబూ! డాక్టరుబాబూ! దా న్నొదిలేయండి! అది మంచిదికాదు. మ చెడ్డది.' వాళ్ళ అరుపుల్లో యింకా నామీద గౌరవం అలాగేవుంది. యింతవరకు




అలివేలుని రేప్ చేసే రమకుంటున్నాను. కానీ యిప్పు డసలు జరిగిందేమిటో బోధ పడటంలేదు. అలివేలు తప్పుచేసిందా? పాపం చేసిందా? ఛా! అలివేలు అలాంటి మనిషి కావడానికి వీల్లేదు; ఏదో అపార్థం ప్రబలి ప్రమాదానికి దారితీసి వుంటుంది– అనుకొంటూ నానిశ్చయానికి నేను వచ్చేసేను.

మెల్లగా వీధివేపు తలుపుతెరిచి గుమ్మంలోకి వచ్చేను. గుమిగూడిన జనంలోంచి యిద్దరు పెద్ద మనుషుల్లాంటి వాళ్ళు నా దగ్గరగా వచ్చేరు. అలివేలు గాయపడ్డంకంటే నాచుట్టూదేవతల్లా బ్రతికే ఆమనుషులు దానవులయి పోవడం నేను చూళ్ళేకపోయేను.

నా మనస్సు వుడికిపోయింది. నేను వాళ్ళవేపు కర్కశంగా చూసేను. వాళ్ళకి నామీదవున్న గౌరవాన్ని వాడుకుంటూ అన్నాను – 'ఏం జరిగింది? మీరిలా రాక్షసులై పోయారేం?'

'అంతమాటనకండి బాబూ! అదెవరో మీకు తెలియదు. దొంగ రాక్షసి! కూడనిపని చేసింది బాబూ? దాన్ని ప్రాణాలతో వదిలితే పాపం బాబూ! కీడు. తమరేనా ఏ మందో మాకో యిచ్చి హతం చేయండి!'

నేను కోపంగా వణికేను. అరిచేను – 'వెళ్ళండి!' అని కసిరేను – 'దేవుడైనా, రాక్షసుడైనా అనారోగ్యంతో నాదగ్గరికివస్తే ఒకేలాగ ఆదరించడం నేర్చుకున్న వాణ్ణి నేను. ఆమెను విడిచి పెట్టడానికి వీల్లేదు. మీరు లోపలికి అడుగు పెట్టడానికి అంతకన్నా వీల్లేదు.'

'లోపలికి రాం బాబూ! మేమూ మనుషులమే కానీ యిది మావూరి సమస్య. పరిష్కరించకోకపోతే మా వూరు పాడైపోతుంది బాబూ,'

'అయితే నేను మీకు పరాయివాణ్ణా?' నాలో బాధకలగడం వాళ్ళు చూసేరు – 'బాబూ! లేదు బాబూ! కానీ యిక్కడ పుట్టిన వాళ్ళం, యిక్కడ పెరుగుతున్న వాళ్ళం బాబూ! యీనేలకి మేం ఋణపడ్డాం. దీన్ని పవిత్రంగా చూసుకోవాలి బాబూ! దాన్ని విడిచిపెట్టండి.'

'వీల్లేదు; నాదగ్గర పేషెంటుగా వున్నంత వరకూ నాకూ మీకూ కూడా ఆ అధికారం లేదు వెళ్ళండి!'

'వెళ్ళం బాబూ! యిక్కడే వుంటాం. ఎన్నాళ్ళయినా వుంటాం. అయితే దానికి ఆరోగ్యం చిక్కాకే దాన్ని మా చేతికి చిక్కనివ్వండి. అప్పుడే తేల్చుకుంటాం.' ఖండితంగా చెప్పేరు. 'అసలు జరిగిందేమిటో మీకు తెలియదు బాబూ!'–

'మీరు మనుషుల్లా ప్రవర్తించలేదని తెలుస్తూనే వుంది. ఏం జరిగిందో నేను తెలుసుకోగలను. మీరు చెప్పక్కర్లేదు.' తలుపువేసి లోపలికి వచ్చేను.

అలివేలు మూలుగుతోంది. తొందరగా గాయాలకి చికిత్స చేస్తూ అడిగేను–

'యిల్లు ఎలా కనుక్కొన్నావ్?'

'వెతికేను. బోర్డు కనబడింది. కాస్త చదువుకున్నాను.'

కొన్ని గంటల క్రితం గుంటలో దిగబడ్డ వాన్‌ని ముందుకి తొయ్యగలిగిన అలివేలు, యిప్పుడు కేవలం మాట్లాడ్డానికి భరించలేని బాధ చూపిస్తూంటే నా గుండె నీరయింది. కాస్సేపటికి వెయ్యవలసిన మందులు వేసి, కట్టవలసిన కట్లుకట్టి, యివ్వవలసిన యింజక్షన్లు యిచ్చి, స్టౌమీద బ్లాక్ కాఫీచేసి యిచ్చాను. బెడ్ పక్కనే నిశ్చలంగా కూర్చొని నిద్రని దూరం చేసుకొన్నాను. అలివేలుని దూరం చేసుకోకూడదనే ఆలోచన నాలో ఆకాశమంత పెరుగుతోంది – అక్కడికి అలివేలు నాదైనట్టు. ఆమెలో సత్తువ కాస్త చేరినట్టయింది, కళ్ళుతెరిచి కృతజ్ఞత చూపిస్తోంది. యిప్పుడు మాట్లాడించేను – 'నిన్ను వాళ్ళు కొట్టారా?' అవునన్నట్లు కంటి రెప్పలకదలికతో చెప్పింది. అడిగేను – 'ఎందుకూ?'

'దేవుణ్ణి తీసుకు వెళ్దామనుకున్నాను.'

'అసలేం జరిగిందో వివరంగా చెప్పు.'

'యిందాకా వేణుగోపాలస్వామి దగ్గరికి వెళ్ళాను. గుళ్ళో దేవుడుకోసమేగా యింత రాత్రి యింతదూరం వచ్చింది. గర్భగుళ్ళోకి వెళ్ళి విగ్రహాన్ని గునపంతో తవ్వుతూంటే చప్పుడైంది. వూరంతా లేచి వచ్చారు, నన్ను చూశారు. మా దేవుణ్ణి దొంగిలిస్తావా– అన్నారు. అసలే దొంగతనం, అందులో అపచారం అన్నారు. పాపంచేశా వన్నారు. వాళ్ళూ, నేనూ ఘర్షణ పడ్డాం. వాళ్లు నన్ను తిట్టారు. నాకు కోపంవచ్చింది. యిద్దర్ని నేను కొట్టాను. వాళ్ళకి రక్తం వచ్చింది. అంతే, అంతా నామీద తిరగబడ్డారు. నా పాపానికి చావే శిక్షన్నారు. యిదుగో– చూస్తున్నారుగా ఏం చేశారో! ఎలాగో తప్పించుకుని మీ యింటిముందు డాక్టరుబోర్డు వెతుక్కున్నాను. నా శిక్షింకా పూర్తికాలేదు. నే నొచ్చినపనీ పూర్తికాలేదు.'

'ఎంతపని చేశావ్ అలివేలూ! యీ వూళ్ళో దేవుడే వీళ్ళ ప్రాణం. ఆయన్ని గునపంతో పొడిస్తే, అది వీళ్ళ గుండెల్లో తగుల్తుంది. మంచివాడికోపం దేవుడుకంటే బలంగా వుంటుంది. ఏమైనా నువ్వు చాలా పెద్దతప్పు చేశావ్! అయినా యిందులో అసలు నీవుద్దేశం ఏమిటి?'

'నాన్నకి జబ్బుగా వుంది. తొందరగా చచ్చిపోతాడు. డాక్టర్లే చెప్పారు.'

'యీ దేవుడు వచ్చి బతికిస్తాడనుకున్నావా?'

'కాదు. నాన్నగారు గొప్ప శిల్పి. వేణుగోపాలస్వామి అంటే ఆయన కెంతో భక్తి. యీ దేవుణ్ణి కొన్ని సంవత్సరాలు కష్టపడి నాన్నే చెక్కారు. ఈ విగ్రహంలో దేవుడంటే ఆయనకి ఎంత పారవశ్యమో నేను చెప్పలేను. ఆయన కడుపున పుట్టిన ఆడదాన్ని, నాకేతెలుసు.' ఆమె క్షణంఆగి మాట్లాడింది – 'చివరికి యీ తుదిఘడియల్లో చచ్చిపోయేముందు చివరిసారిగా నా దేవుణ్ణి చూసి ప్రాణాలు విడిస్తే బాగుణ్ణు. భగవంతుడా! అంటూ పలవరిస్తూంటే నా కనిపించింది. నాన్న ఎలాగూ కదల్లేడు. యింత దూరం యిప్పుడు ఆయన్ని నే నెలాగూ తీసుకువచ్చి దైవదర్శనం చేయించలేను. ఒకవేళ అలా తీసుకువచ్చినా, దారిలో నాన్న కడసారి కోరిక తీరకుండా నిక్కష్టపుచావు చావడం నేను సహించలేను. తల్లీ, తోబుట్టువులూ లేనిదాన్ని. నాన్నే నన్ను యింతమనిషిని చేశాడు. రక్తబంధంకంటే కృతజ్ఞతమీద నాకు నమ్మకం వుంది. అందుచేతే దేవుణ్ని నేనే తీసుకువెళ్ళి ఆయనకి చూపిద్దామనుకున్నాను. మీకు నా వుద్దేశం పిచ్చిగా వుండొచ్చు. మరి మీరే చెప్పండి? నాన్నని దేవుడు పుట్టిస్తే, నాన్న దేవుణ్ణి సృష్టించాడు. యీ రోజు యీ మనుషుల్లో యింత శక్తినీ, నమ్మకాన్నీ పెంచినదేవుణ్ణి నాన్నే తీర్చిదిద్దాడు. నాన్నకి మరి ఆమాత్రం హక్కులేదా చెప్పండి? దేవుడికి మాత్రం ఆ మాత్రం విధాయకం కాదా – చెప్పండి!– చెప్పండి డాక్టరుగారూ! యిప్పుడు నేను చేసింది తప్పంటారా? పాపం అంటారా? దొంగతన మంటారా?' ఆమె గొంతు బొంగురుపోలేదు – 'చూడండి డాక్టరుగారూ! నాకు నే నేమైపోయినా బాధలేదు – ఎవరే మనుకున్నా భయంలేదు. జన్మిచ్చిన నాన్న ఋణం నేను తీర్చుకో గలిగితే చాలు. దయచేసి మీరైనా నాకీ సహాయం చేసిపెట్టండి. దేవుణ్ణి తీసుకువెళ్ళి నాన్నకి చూపించండి. ఆయన తృప్తిగా కళ్ళు మూస్తే నా బ్రతుకంతా పండగవుతుంది. చెయ్యరూ! – నాకోసం' అలివేలు కళ్ళ నీళ్లు పెట్టుకుంది.

వింటున్నదీ, జరుగుతున్నదీ నాకు అయోమయంగా వుంది. యిన్నేళ్ళ జీవితంలో యింత చిత్రమైన సంఘటన నాకెప్పుడూ తటస్థపడలేదు. మౌనంగాలేచేను. కిటికీవేపు నడిచేను. నా మనుషులు చెట్ల క్రింద నిమిషాలు లెక్కపెడుతున్నారు. నా మనసులో అలివేలు రక్తమై ప్రవహిస్తోంది. చివరికి ఒక నిశ్చయానికి రాగలిగాను. అలివేలుదగ్గరగా వచ్చి కూర్చొని అదే చెప్పేను–

'నువ్వు చేసింది చెయ్యరానిపని. నేను నీకు ఏ సహాయం చేయలేను. నీ పరిస్థితికి జాలి పడగలను. నీకు ఆరోగ్యాన్ని ఇవ్వ

గలను. అంతే. కానీ నీ కోసం భగవంతుడి విగ్రహాన్ని తవ్వలేను. యీ మనుషుల నమ్మకాలన్నీ యిక్కడి దేవుడిగా వెలిసేయి. అలివేలు! నా మాట విను; దేవుణ్ణి చెక్కి నీ తండ్రి ఏనాడో దేవుడయ్యాడు. దేవుణ్ణి కొట్టి తస్తే ఏ నాటికీ నీ తండ్రి నిన్ను క్షమించడు. తృప్తిగానూ మరణించడు. కాబట్టి నే చేయగలిగిందల్లా ఒక్కటే. నీకు ఆరోగ్యం చేకూరేదాకా యిక్కడ రక్షణ యివ్వడం. నాకు నీతో పెద్దపరిచయం లేదు – నీగురించెంతో తెలియదు – అయినా నీ ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నిస్తాను. అంతకంటే నేను చెయ్యగలిగిందేమీలేదు '



అలివేలు నా మాటలువిని, అంత మనిషీ ఆకులా వణికింది. నిస్సహాయత, దైన్యం కలిసి ఆమెని దుఃఖసముద్రంగా చేసేయి. ఆమె పరిస్థితి అసలే బాగుండలేదు. గాయాల బలానికీ, భావాలతాకిడికీ ప్రాణాలు వదిలేస్తుందేమోనని భయంవేసింది నాకు. వెంటనే నిద్రకి మందిచ్చేను. కాస్సేపటికి అలివేలు అంతులేని నిద్రలోకి జారింది. నేను ఆలోచనాముద్రలోకి జారేను.

అలివేలు చేసిన పనిలో నాకేమీ అర్థం కనిపించలేదు. వూహించని విపత్తు నెత్తిమీదకి తీసుకొచ్చింది. ముందు పరిస్థితి వూహించుకుంటే ఏం చెయ్యడానికీ ఆలోచన తెగటంలేదు. ఏమైనా అలివేలు నిరక్షించడం నా ధర్మంగా భావించేను. అయితే రక్షించడం ఎలాగన్నదే ప్రశ్నఅయి కూర్చుంది. రక్షించడమంటే తప్పించడమన్నమాట. ఎందుకంటే వూరి వాళ్ళని ఎవరూ వూరుకోబెట్టలేరు. అలివేలుని అగ్నిగుండంలోకి తొయ్యలేను.

ఆరోజు ఎలాగో గడిపేసేను. వూరివాళ్ళంతా ఏకమైపోయేరు. వాళ్ళ చూపుల్లో క్రమంగా నా మీద గౌరవం తగ్గిపోవడం గమనించేను. నాకు వాళ్ళల్లో మిగిలివున్న మంచితనపు ఛాయ ఒక్కటే కనబడింది – నా మాట జవదాటి నా యింట్లోకి రాకపోవడం. వాళ్ళు యింటిముందే షిప్ట్‌బేసిన్‌మీద కాపు వేస్తున్నారు, రాత్రీ, పగలూ బోనులో సింహం పిల్లలా అలివేలు నా యింట్లోనే బందీ అయిపోయింది.

ఆ మర్నాడుకూడా గడిచింది. ప్రజలు పట్టుదలని అలాగే పట్టుక్కూర్చున్నారు. నాకు రకరకాలుగా నచ్చచెప్పేరు. నేను ససేమిరా అన్నాను. క్రమంగా నాకు యింట్లో అలివేలు కంట్లో నలుసులా తయారైంది. రెండు రోజులక్రితం ఆమె దగ్గర తనంకోసం పిచ్చెక్కిన నేను – యిప్పుడు ఆమె దగ్గిరయితే పిచ్చివాణ్ణవుతున్నాను.

ఈ రెండ్రోజుల్లోనూ అలివేలు ఆరోగ్యంలో ఏమంత మంచి మార్పేమీ రాలేదు. కాకపోతే, మాటల్లో మరింత దగ్గిరయి ఆమె నా గుండెల్లో జాలి మేడలు కట్టింది. అంచేత అలివేలు నాకు సమస్య అయిపోయింది.

మూడోరోజు మూడ్ నాదేం మారలేదు. ఏదో ఒకటి తేల్చేసి తలబరువు దింపుకోవాలనుకుంటున్నాను.

రాత్రయింది. వర్షం నిన్నే మానేసింది.

చీకటి చింతలా పెరిగింది. నేను నిద్రపోలేదు. కిటికీలోంచి చూస్తే వాళ్ళు ఆలాగే కాపువేసి, లాంతరు వెలుగులో కునికిపాట్లు పడుతున్నారు. మూడు రోజులుగా వాళ్ళు పనులన్నీ మానేసేరు, ఏకదీక్షగా. భక్తిని రక్షించుకోడానికి నిరంతరం కృషిచేయాలని నాయింటిముందలా నిఘావేసేరు జరిగేదంతా నాకు చాలా డ్రమెటిక్‌గా అనిపిస్తోంది నిజంలో కొత్తదనాన్ని యీ సంఘటనతో యిప్పుడు చూస్తున్నాను.

అలివేలు నిద్రపోతోంది.

మెల్లగా యింటికి పెరటివేపు నడిచేను. గుమ్మంతెరిస్తే చిమ్మచీకటి నెమ్మదిగా తలుపుజారేసి, నిశ్శబ్దంగా వెనక చెట్ల నీడల్లోకి చీమలాపాకి కాస్సేపట్లో వూరువదలి ఆత్రంగా రోడ్డెక్కేను. బ్యాటరీ లైటు వెలుగులో దోవ గుర్తుపడుతూ తొందరగా దగ్గరలోవున్న టౌన్‌కి నడిచేను.

* * *

పోలీస్‌వాన్ నా యింటిముందాగింది. ముందు నేనుదిగి యింట్లోకి నడిచేను. హఠాత్తుగా బెడ్‌మీది దృశ్యంచూసి తట్టుకోలేకపోయేను. వూహించని వుపద్రవం జరిగిపోయిందనుకున్నాను.

అలా అలివేలు మంచంమీంచి మాయమైందని తెలియగానే హడావుడిగా యిల్లంతా గాలించేను. పెరటిగుమ్మం బార్లా తీసివుంది. కంగారుగా వెనక్కివస్తే — వూరి మనుషులు నేను లేకపోవడం పసిగట్టి, సహనాన్ని కోల్పోయి, అలివేలుని హతం చేసేరేమోనని — అనుమానం వేసింది. భయంగా బైటికి వచ్చేను.

పోలీసులు పోలీసుల్లాగే నిలబడ్డారు. ప్రజలు నన్ను మింగెయ్యాలన్నంత కోపంగా చూస్తున్నారు. 'అలివేలు నేంచేసేర'ని దీనంగానే అడిగేను. వాళ్ళు తెల్లమొహాలేసేరు. ఆశ్చర్యపోయేరు. గబగబా నా యింట్లోకి పరిగెట్టి, వెదికి నిర్ధారించుకున్నారు. ఆ ప్రదేశం నాలుగు మూలలా లాంతర్లతో చెట్లనీడల్ని చెండాడుతూ వెదికేరు, ఆమెజాడ తెలియలేదు. స్థాణువులా నిలబడితే మళ్ళా నన్ను మరో ఆలోచన కదిలించింది. జనమంతా నా వెనకాల పరిగెట్టిరాగా నేను వేణుగోపాలస్వామి ఆలయంవేపు సాగేను.

ఆశ్చర్యం! — అక్కడ అలివేలు లేదు.

అంతకంటే ఆశ్చర్యం! — అక్కడ భగవంతుడి విగ్రహంకూడా లేదు. ఆ ప్రదేశం ఖాళీగా — పెచ్చులురేగి పగిలిన గుండెలావుంది. పక్కనే పాతగునపం పని పూర్తిచేసుకుని, కాటేసినపాము చచ్చినట్టుగా పడివుంది. ఆ ప్రదేశమంతా చిమ్మిన రక్తంతో చిందరవందరగా వుంది. నేను తొందర తొందరగా ఆలోచించేను. నా వెనకాల జనం హాహాకారాలు చేసేరు. రోజూ వాళ్ళిగుళ్ళో నమస్కారాలు చేసేవారు.

విసురుగా వీచే తెల్లవారుఝాము గాలికి గంటలుకదిలి మ్రోగితే ప్రజలు కీడు శంకిస్తూ భయపడ్డారు. నేనువాళ్ళని వారిస్తూ, చేతిలోదీపంతో జాడలు వెదికేను. రక్తం చిమ్మిన గుర్తుల్ని పట్టుకుని ఆత్రంగా కదిత్తే ఆదారి మమ్మల్ని వూరు దాటించేసింది. సమయం చల్లగావున్నా, చెమటలు వొళ్ళంతా పట్టేయి నాకు. నా శరీరంలో ఒక భాగం ఎక్కడో జారి పడిపోయినట్టు, అలివేలుకోసం దిగులుపడిపోయి దిక్కులు వెదుక్కుంటూ వడివడిగా నడిచేను. సుమారు మైలున్నర నడిచేక మార్గం బోధపడింది. వెంటనే దగ్గరలోవున్న చిన్నరైల్వేస్టేషన్ దగ్గరికి వెళ్ళేం.

రైలు అందక హతాశురాలయిన ఓ అమ్మాయి ప్లాట్‌ఫారమ్‌మీద వున్నదని స్టేషన్ మాస్టరుద్వారా తెలుసుకున్నప్పుడు, నేనున్న ఊళ్ళో గుడిలాగే, నాకున్న వొంట్లో మనస్సుకూడా ఖాళీగా వెలితిగా అయిపోయింది.

నేను ప్లాట్‌ఫారమ్ మీదికి పరిగెట్టేను. అదంతా నిర్మానుష్యంగా వుంది. అక్కడా అక్కడా దీపాలు వెలిగించుకున్న రెండు మూడు స్తంభాలు తప్ప తక్కిందంతా ఎడారిలావుంది. అలివేలుని చూడాలనే దాహంతో అలాగే వెర్రి వాడిలా నడిచేను. అంతలో దీపంవెలిగే ఓ స్తంభానికి దగ్గరగా నీడ పోగుచేసినట్టు నాదృష్టి ఏదో నాకర్షించింది, దగ్గరకెళ్ళి చూసేను.

నాగుండెలు జారేయి. నా మనస్సులో మహారణ్యాలు తగులబడ్డాయి. నాఎదుటి దృశ్యం నన్ను నాలోంచి వేరుచేసి, వేరే చోటికి విసిరేసింది.

రక్తంలో అలివేలు తెంపేసిన గులాబీ దండలా పడివుంది. ఆమె రొమ్ములమీద వేణుగోపాలస్వామి నిగ్రహించుకోలేక విగ్రహమై పోయినట్టున్నాడు. అలివేలు రొమ్ములమధ్య అందమైన దేముడు ఇంకా నిద్ర లేవలేదు.. గుడికంటే గుండె పదిలం కాబోలు! అలివేలు రక్తం దేవుడికళ్ళకి అంటుకుంది — భక్తిని భరించలేక రక్తం కారుస్తూ ఏడిచినట్టు. రక్తాన్ని పంచుకున్నందుకు ప్రతిఫలంగా చూపే అచంచలమైన కృతజ్ఞత నాకు అలివేలు శవంలో కనబడుతోంది. నారెప్పలక్రింద కళ్ళు చెమర్చేయి.

భక్తి శిఖరంలాంటిది. అది పర్వతాల్లోనే సాధ్యం. అలివేలు తండ్రిలో దేవుణ్ణి చూసింది. అంచేతే తనువులో దేవతైంది.

నేను అలాగే నిలబడిపోయేను. ★

